# ప్రజాశక్తి

శుక్రవారం 18 ఆగస్టు 2023 | 8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

విజయవాడ - బందరు రోడ్డు

## ఆరు లైన్లుగా విస్తరణకు చర్యలు

### అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మచిలీపట్నం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో ఆయన జాతీయ రహదారుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి నంబర్ 65ను ఆరు వరుసల రహదారిగా విస్తరించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. ఈ రహదారిలో ఇంకా కొంతనపాడు, ఉయ్యూరు, చేపలగుండి తదితర ప్రాంతాల్లో మురికి కాల్వలు, బైపాస్ రోడ్లు వంటి నిర్మాణాల వద్ద ఇంకా మిగిలిపోయిన పనులకు టెండర్లు ఖరారయ్యాయని తెలిపారు. కాంట్రాక్టర్ల నుండి ఒప్పందాలు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. విజయవాడ ఆటోనగర్ నుండి పోరంకి వరకు ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు పెనమలూరు తహశీల్దారుతో సమన్వయం చేసుకోవాలన్నారు. నిడుమోలు వద్ద ఉన్న మసీదు భూసేకరణ విషయమై ఆ కమిటీ వారు రాష్ట్ర హైకోర్టులో కేసు వేసినందున రహదారి అసంపూర్తిగా ఉందని, దీనిపై రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు శుక్రవారం ఆ ప్రదేశాన్ని సందర్శించి మసీదు కమిటీ వారితో మాట్లాడి పరిష్కారమార్గం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. సిఆర్‌డిఎ పరిధిలో ఎగుమతులు దిగుమతులకు వీలుగా రానున్న మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్‌కు అవసరమైన వంద ఎకరాల భూమిని మచిలీపట్నం ప్రాంతంలో సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఇక్కడ బందరు పోర్టు, రైల్వే స్టేషన్, జాతీయ రహదారి వంటి అనువైన ప్రాంతాలు ఉన్నాయని, తద్వారా ఈ ప్రాంతం అన్ని విధాలా అభివద్ధి చెందుతుందని తెలిపారు. రాత్రి సమయంలో జాతీయ రహదారిలో పలుచోట్ల వీధి దీపాలు వెలగక చీకటిగా ఉందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. వెంటనే అన్ని లైట్లు వెలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసమావేశంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డివి.నారాయణరెడ్డి, కన్సల్టెంట్ కపిల్ ప్రసాద్, సైట్ ఇంజినీర్ అనిల్, కలెక్టరేట్ ఏవో రాధిక పాల్గొన్నారు.

# ఎంపి కేశినేని ఎక్కడ?

- మూడు గ్రూపులు... ఎవరికి వారే ప్రెస్‌మీట్లు...
- లోకేష్ పాదయాత్ర సన్నాహాల్లో తెలుగు తమ్ముళ్లు



**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఈనెల 19వ తేదీ నుండి ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాగే నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రపై టిడిపి నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. అంతేగాక లోకేష్ పాదయాత్ర వస్తున్న సమయంలో ఆ పార్టీకి చెందిన విజయవాడ ఎంపి కేశినేని నాని అందుబాటులో లేకుండా పోవడంతో పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ముందుగా ప్రకాశం బ్యారేజి వద్ద విజయవాడలోకి ప్రవేశించే లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో గురువారం మూడు గ్రూపులుగా టిడిపి నేతలు వేర్వేరు ప్రెస్‌మీట్లు నిర్వహించారు. ఎవరికి వారే పోటాపోటీగా మీడియా సమావేశాలు పెట్టారు. 'పశ్చిమం'లోని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) గ్రూపునకు చెందిన మైనార్టీ నాయకులు ఎం.ఎస్.బేగ్, పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జలీల్‌ఖాన్ తమ తమ కార్యాలయాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించగా, మాజీ ఎంఎల్‌సి, టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు బుద్దా కార్యాలయంలో కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో మీడియాతో మాట్లాడారు. ఇలా మూడు గ్రూపులుగా విడిపోయిన తెలుగు తమ్ముళ్లు లోకేష్ పాదయాత్రను ఎలా విజయవంతం చేస్తారనే దానిపై ఆ పార్టీ శ్రేణుల్లోనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయా గ్రూపులకు చెందిన నేతలు తమ తమ ఫొటోలతో ఫ్లెక్సీలు, భారీగా హోర్డింగ్‌లు, బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రూపుల విషయమై టిడిపి సీనియర్ నేత కేశినేని చిన్నిని మీడియా ప్రశ్నించగా, గ్రూపులంటూ ఏమీలేవన్నారు. అందరం కలిసి కట్టుగా లోకేష్ పాతయాత్రను విజయవంతం చేస్తామన్నారు. మరోవైపు టిడిపి నుండి రెండుసార్లు ఎంపిగా గెలుపొంది, ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న కేశినేని నాని నగరంలో లేరని పార్టీ శ్రేణులు లేరని చెబుతున్నాయి. పార్టీ అధిష్టానం కేశినేని చిన్నికి యువగళం పాదయాత్ర, గన్నవరంలో బహిరంగ సభ బాధ్యతలు అప్పగించటంతో అసంతృప్తికి గురైన కేశినేని నాని అందుబాటులో లేకుండా పుణ్యక్షేత్రాలకు వెళ్ళినట్లు సమాచారం. ఏదిఏమైనా పశ్చిమంలో నెలకొన్న గ్రూపు విభేదాలు ఇలానే కొనసాగితే భవిష్యత్తులో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని టిడిపి శ్రేణులు చర్చించుకుంటున్నాయి.



## లోకేష్ పాదయాత్రకు విస్తృత ఏర్పాట్లు

- 19న బ్యారేజ్ వద్ద ఘనస్వాగతం
- 50 వేల మంది వరకు జన సమీకరణ
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో నాలుగు రోజులు పాదయాత్ర
- 22న గన్నవరంలో సభ
- ప్రజాశక్తితో కేశినేని శివనాథ్ (చిన్ని)

వార్త 8లో




దెబ్బతిన్న మున్నేరు ఆనకట్టను సదస్సులో ప్రదర్శిస్తున్న రైతు, కౌలు రైతు సంఘాల నేతలు పివి.ఆంజనేయులు, చనుమోలు సైదులు, సిహెచ్.హనుమంతరావు

## మున్నేరు ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయాలి

### రైతు, కౌలు రైతు సంఘాల నేతలు ఆంజనేయులు, సైదులు, హనుమంతరావు డిమాండ్

**ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు :** మున్నేరు ఆనకట్టకు పడిన గండ్లకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే ఆయకట్టు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులోని హరి గార్డెన్స్‌లో గురువారం మున్నేరు ఆయకట్టు రైతుల అవగాహనా సదస్సు జరిగింది. రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆనకట్టకు మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ సామినేని ఉదయభానుకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. 21న జగ్గయ్యపేట ఇరిగేషన్ డిఇ కార్యాలయాన్ని ముట్టడించాలని, అనంతరం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించాలని, అవసరమైతే సిఎంను కలిసి విన్నవించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మున్నేరు ఆయకట్టు రైతుల ఐక్య కార్యాచరణ నూతన కమిటీని రైతులు ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మండేపూడి చంద్రశేఖర్ వ్యవహరిస్తారు. ఈ సదస్సులో రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా (మిగతా 6లో)

ఉద్యోగాల పేరుతో మోసగించిన

## యువకుడు కిడ్నాప్

### నిందితులను పట్టుకున్న పోలీసులు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** స్థానిక రింగ్‌సెంటర్‌లో బుధవారం రాత్రి సినీ పక్కీలో జరిగిన ఓ యువకుడి కిడ్నాప్‌ను పోలీసులు చేధించారు. అందరూ చూస్తుండగానే ఓ యువకుడిపై కొందరు దాడి చేసి కారులో తీసుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమై కిడ్నాపర్లను పట్టుకున్నారు. ఈ ఉదంతంపై ఇబ్రహీంపట్నంలో పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి హనుమంత రావు మాట్లాడుతూ గంపలగూడెం మండలం వినగడపకు చెందిన దిలీప్ అనే వ్యక్తి స్టీల్ ప్లాంట్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన 130 మంది వద్ద నుండి సుమారు రూ.60 లక్షల వరకు వసూలు చేశాడని తెలిపారు. తమకు ఉద్యోగాలు ఇప్పించాలని కొద్దిరోజులుగా డబ్బులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మొఖం చాటేస్తున్నాడని పేర్కొన్నారు. హఠాత్తుగా దిలీప్ కనిపించడంతో ఇబ్రహీంపట్నంలో ఆపి డబ్బులు ఇవ్వాలని కోరారని, ఆయన నుండి స్పందన లేకపోవడంతో బలవంతంగా కారులో ఎక్కించి పవిత్ర సంగమం వైపు తీసుకెళ్లారని తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు అప్రమత్తమై కిడ్నాప్ చేసిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. కిడ్నాప్‌కు యత్నించిన యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై కూడా ఆధారాలను సేకరించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు. గాయపడిన దిలీప్‌ను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎసిపి హనుమంతరావు


పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెక్కులు అందజేస్తున్న ఆంజనేయులు

## పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండలం, లక్ష్మీపురం పాలశీతల కేంద్రం పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత బోనస్ 1.80 కోట్ల రూపాయల చెక్కులను కష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం పాల సొసైటీల అధ్యక్షులకు అందజేశారు. పాలశీతల కేంద్రంలోని కళ్యాణ మండపంలో జరిగిన బోనస్ పంపిణీ ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో యూనియన్ మొదట విడత ధర వ్యత్యాసం (బోనస్) రూ.14.80 కోట్లు పంపిణీ చేశామన్నారు. రైతు పక్షపాతిగా పేరొందిన కష్ణా మిల్క్‌యూనియన్ డాక్టర్ వర్గీస్ కురియన్ మార్గనిర్దేశాలకు అనుగుణంగా, సహకార చట్టాన్ని బలోపేతం చేయడానికి కృషిచేసిన ఎన్టీ రామారావు, కాకాని వెంకటరత్నం సేవల వల్ల పాడి రైతులు, వినియోగదారుని నుండి ఆర్జించిన ప్రతి రూపాయిలో 75 శాతం రైతుకు చేరినప్పుడే సహకార స్ఫూర్తికి సార్థకమని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.


మాట్లాడుతున్న గద్దల భారతి

## ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండలం చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివద్ధి కమిటీ సమావేశం గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఛైర్మన్, తిరువూరు మండల పరిషత్ అధ్యక్షులు గద్దల భారతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలు జ్వరాలు బారిన పడకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అలాగే ఆరోగ్య పరంగా ఎవరికి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని వైద్యలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, పూజిత, సీనియర్ అసిస్టెంట్ కష్ణ ప్రసాద్, విహెచ్ఒ దీవెనమ్మ, ఎంపిహెచ్ఒ శ్రీనివాసమూర్తి, ఎంపిహెచ్ ఎస్.పి.మధుసూదనరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడో వార్డులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** పట్టణం ఏడవ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రాజగోపాల్ ఇంటింటికీ వెళుతున్న సమయంలో వారు వాళ్ల బాధను తాతయ్య దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ గతంలో 2014లో తెలుగుదేశం గవర్నమెంట్ ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు విశాఖను ఐటీ హబ్‌గా ప్రకటించి ఐటీ కంపెనీలు తీసుకువచ్చారన్నారు. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ చంద్రబాబు నాయుడు మన రాష్ట్రానికి హైదరాబాద్, బెంగళూరు లాగా పూర్వ వైభవం తీసుకొచ్చే అవకాశం ఉందని ఐటి నిపుణులు ఆ విధంగా కోరుకుంటున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, బోస్ యాదవ్ పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

**ప్రజాశక్తి - మైలవరం :** మణిపూర్లో శాంతిభద్రతలను కాపాడి, శాంతిని పునరుద్ధరించి అక్కడి ప్రజలను కాపాడాలని కోరుతూ గురువారం జి.కొండూరులో డివైఎఫ్ఐ, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మత ఘర్షణలు సష్టించడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సంగీతం సురేష్, బాలకష్ణ, శ్రీనివాస రావు, జి కొండూరు పాస్టర్స్ ఫెలోషిప్ మోసే, నిఖిల్ పాల్గొన్నారు.

# రెండో దశ రీ సర్వేపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి - విజయవాడ :** రెండవ దశ రీసర్వే ప్రక్రియను ఈ నెలాఖరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వే ప్రక్రియను గురువారం సి.సి.ఎల్.ఏ. ప్రధాన కార్యాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియ, గ్రౌండ్ ట్రూతింగ్ తదితర అంశాలపై సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్, సీసీఎల్‌ఏ అదనపు ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ వీడియో కన్ఫెరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ రీసర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో రెండవ దశ రీసర్వే లక్ష్యంలో భాగంగా 59 గ్రామాలలో ప్రక్రియ జరుగుతుందన్నారు. నందిగామ డివిజన్‌లో 48 గ్రామాలు, విజయవాడ డివిజన్‌లో 11 గ్రామాలు ఉన్నాయన్నారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ వంటి వివిధ దశలలో ఉన్నాయన్నారు. అన్ని గ్రామాల్లో ఈ సర్వే ప్రక్రియ వేగవంతం జరుగుతుందని నిర్ధేశించిన ఈనెల 31వ తేదీలోగా సర్వే, సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ డిల్లీరావు సిసిఎల్‌కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి కె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భారాలు రద్దు చేయకపోతే ఉద్యమం



ధర్నాలో మాట్లాడుతున్న పి.కృష్ణమూర్తి

**ప్రజాశక్తి - విజయవాడ :** రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ భారాలను రద్దు చేసుకోకుంటే మరో విద్యుత్ పోరాటం తప్పదని మధురానగర్ సిపిఎం 29వ డివిజన్ నాయకులు పి.కృష్ణమూర్తి హెచ్చరించారు. పెరిగిన విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కొబ్బరితోట ఏరియాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలను తూచా తప్పకుండా అమలుచేస్తూ రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపుతుందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా సిపిఎం వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తుం దన్నారు. వినియోగ దారులు కూడా విద్యుత్ భారాలపై సిపిఎం నిర్వహిస్తున్న పోరాటాల్లోకి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్ర విజయవంతానికి ఏర్పాట్లు

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమా

**ప్రజాశక్తి - విజయవాడ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పార్టీ శ్రేణులు విశేష కృషి చేస్తున్నట్లు ఆపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో ఆయన గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో నుంచి ఈ నెల 19న ఎన్‌టిఆర్ జిల్లాలోని యువగళం పాదయాత్ర ప్రవేశించే సమయములో ప్రకాశం బ్యారేజి వద్ద లోకేష్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు అన్ని రకాల ఏర్పాట్లు ఇప్పటికే దాదాపుగా పూర్తి అయ్యాయన్నారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో ఇప్పటి వరకు జరిగిన పాదయాత్ర కార్యక్రమంలో ఎక్కడా జరగని రీతిలో ఘనంగా ఇక్కడ లోకేష్‌కు స్వాగతం పలకడం జరుగుతుందని అన్నారు. బేతాళ నృత్యాల దగ్గర నుంచి దుర్గమ్మ అమ్మవారి 50 రకాల వేషధారణలతో, డప్పులు ఇతర సాంస్కృతిక రూపాల ద్వారా ఘనంగా స్వాగతం పలకడం జరుగుతందన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి 15 వేల మంది జన సమీకరణ చేసి తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 188 రోజులు...2,600 కిలోమీటర్లు లోకేష్ పాదయాత్రను పూర్తి చేయడం జరిగిందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జాశక్తి - భవానీపురం :** నేడు భవానీపురం పరిధిలోని 11 కె.వి. భవానీపురం ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా స్వాతి థియేటర్ రోడ్, మానవమందిర్ రోడ్, అమత అపార్ట్‌మెంట్ రోడ్, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పిటల్ రోడ్, ఎం.పీ.దాస్ వీధి, ఆకులరాజేశ్వరరావు మిల్ రోడ్ మరియు చెట్ల బజార్ వరకు ఈనెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు (2గంటల) పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్లకార్డులతో నిరసన


గాంధీ విగ్రహం మాయంపై ప్లకార్డులతో నిరస చేస్తున్న మహేష్ తదితరులు

**జాశక్తి - వన్‌టౌన్ :** పశ్చిమ నియోజక వర్గంలోని 37వ డివిజన్ జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు సిగినం శెట్టి రాము గుప్తా ఆధ్వర్యంలో విఎంసి ఆవరణలో మాయమైన మహాత్మా గాంధీ కాంస్య విగ్రహం గురించి వన్‌టౌన్‌లోని కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్య క్రమానికి జనసేన పార్టీ నగర అధ్యక్షులు పోతిన మహేష్ పాల్గొని మహాత్మా మన్నించు అంటూ బ్రోచర్లను పట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడారు.

## క్షతగాత్రులకు పరామర్శ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన వారిని రంగాపురం రాఘవేంద్ర గురువారం పరామర్శించారు. శాంతినగర్‌లో స్కూల్ నుండి వస్తున్న మోపెడ్‌ను ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోపెడ్ మీద తల్లి, ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలపాలవగా బైకిస్ట్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే వారిని విజయవాడ ఆసుపత్రికి పంపించాలని ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ మెంబర్ కతారి హరికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫిజున్నిసా ఫిరోజ్ ఖాన్, కౌన్సిలర్ సాదుపాటి రాజు, పందుల రోశయ్య, వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు.

## రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఎపియుడబ్ల్యుజె వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు టిఆర్ఎస్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల సైదేశ్వర్‌రావు, కట్టా గురవయ్య, బి.రవికిరణ్, వై.శ్రీనివాస్, సోమోజు శ్రీనివాసరావు, ఆరుద్ర నాగేశ్వరరావు, ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

## రాజన్న ఉచిత భోజనం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు సామినేని ఉదయభాను నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిరంతరం జరిగేలా ఏర్పాటు చేసిన రాజన్న ఉచిత భోజన కార్యక్రమం నిర్వహించారు. 765 మంది గురువారం రాజన్న ఉచిత భోజనం చేశారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

## ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** మండలంలోని చిల్లకల్లు-2 ఎస్సీ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతినెల మూడవ గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించుటకు జైపాల్ క్యాంపస్‌లో ఒక రూమ్ ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జైపాల్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన పలువురికి షుగర్, బిపి వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కీర్తి రెడ్డి, సిబ్బంది వెంకట్రావు ఎంపిహెచ్ఎస్, అలివేలమ్మ, రమేష్ బాబు, మాణిక్యం, లక్ష్మణ్, సంధ్య, 104 సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారులకు బోనస్

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** మండలంలోని చిల్లకల్లు క్లస్టర్ పరిధిలోని అన్ని పాల కేంద్రాల్లో పాలు పోసే ప్రతి 100 రూపాయల పాలకు పది రూపాయల చొప్పున ఏప్రిల్ నుండి జూలై వరకు ఒక కోటి 51 లక్షల రూపాయల బోనస్ చెక్కుల ద్వారా కష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు ఎన్.నాగేశ్వరావు, డి.మహేష్‌బాబు, కోక వెంకటేశ్వరరావు, ఇంజన్ రామారావు, చిల్లకల్లు పాలసీతల కేంద్రం మేనేజర్ వీరమాచినేని విజయ సంపత్, పాల కేంద్రాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టపగలే చోరీ

**ప్రజాశక్తి - మైలవరం :** పట్టపగలే చోరీ జరిగిన సంఘటన మైలవరంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం మైలవరం పెద్ద హరిజనవాడకు చెందిన చర్చిపాస్టర్ బుద్ధ శ్రీమాన్ కుటుంబ సభ్యులతో కలిసి చర్చిలో ప్రార్థన చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో తిరిగి ఇంటికి రాగా తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లో చూడగా 8 కాసుల బంగారం, రూ.65,000 నగదు చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు. శ్రీమాన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

# సర్వసభ్య సమావేశం రసాభాస

**సభ్యుల ధర్నాలతో సమావేశం గందరగోళం**

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం గందరగోళంగా మారింది. సభ్యులు ధర్నాలకు దిగడంతో పోలీసుల రంగ ప్రవేశం చేయటం సభ్యులను కొంతమందిని బయటికి నెట్టు వేయడం గందరగోళం మధ్య సర్వసభ్య సమావేశం సాగింది. బొడ్డపాడు గ్రామ సచివాలయ నిర్మాణానికి మంజూరైన ఉపాధి హామీ నిధులు రూ.7లక్షల ను రాజ్యాంగ విరుద్ధంగా పంచాయతీ తీర్మానం లేకుండా వైసీపీ నేతకు చెల్లించడంపై గ్రామ సర్పంచి మూడే శివశంకర్ అధికారులను ప్రశ్నించాడు. దీంతో అధికార సభ్యులు మా ఇష్టం, నిధులను అవసరమైనప్పుడు తీసు కుంటాం, మరల ఇస్తాం అని అనడంతో మూడే శివశంకర్ ఇది మీ సొంత రాజ్యాంగమా లేక మీ సొంత కంపెనీ నాఅని అధికారపక్ష సభ్యులను నిలదీశాడు. సచివాలయ నిధులు ఏడు లక్షల రూపాయలు దుర్వినియోగంపై కలెక్టర్కు ఫిర్యాదు చేశామని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు చెప్పు చేతల్లో బంధీలయ్యారని ఎవర్ని వదలమని హెచ్చరించారు. గరికపారు సర్పంచి వీరంకి రమాదేవి, ఐలూరు సర్పంచి పెరాటి సుజాత శివశంకర్ కు మద్దతుగా నిలిచి సమావేశ ప్రాంగణంలోనే ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి శివశంకర్ ను బయటకు నెట్టివేశారు. సమావేశ హాల్లో ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఎంపీపీ ఏడుపుగంటి రాజామణి, జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో ఈశ్వర పద్మసుద వివిధ గ్రామాల ఎంపీటీసీలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## విజయగౌరికి పిహెచ్‌డి ప్రదానం

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్:** విజయగౌరికి ఆంగ్లం లో పిహెచ్‌డిని కృష్ణాయూనివర్శిటీ గురువారం ప్రదానం చేసింది. విజయగౌరి యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహి స్తున్న డాక్టర్ ఎమ్.కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్హ్యాన్సింగ్ లెర్నర్ ఆటోనమీ త్రు ప్రాసెస్ బేస్డ్ ఎఫెక్టివ్ రైటింగ్ స్ట్రాటెజిస్ అమంగ్ టెర్సియరీ లెవెల్ లెర్నర్స్ ఇన్ గవర్నమెంట్ రూరల్ డిగ్రీ కాలేజెస్ ఆఫ్ విశాఖపట్నం – ఏ కేస్ స్టడీ అనే అంశం పై పరిశోధన చేసి ఆంగ్లంలో పిహెచ్‌డి పొందింది. ఈ సందర్భంగా టి. విజయగౌరిను యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి అభినందించారు.

## వంతెన నిర్మించాలని దీక్షలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామానికి కష్ణానది పాయ పై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం నుండి దీక్షలు ప్రారంభించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో నది సమీపంలో దీక్షలకు పూనుకున్నారు. ఈ సందర్భంగా శేషు బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఏడాది అక్టోబర్ నెలలో అవనిగడ్డ లో జరిగిన బహిరంగ సభలో ఇచ్చిన వాగ్దానం మేరకు 8.5 కోట్లు నిధులు విడుదల చేయాలని, ఎడ్ల లంక గ్రామానికి తక్షణమే వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ నిరవధిక దీక్షలు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి గాజుల శంకర్రావు, జిల్లా పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి బాసు నాంచారయ్య నాయుడు, సీనియర్ నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, రేపల్లె రోహిత్ నాయుడు, తుంగల నరేష్ తదితరులు పాల్గొనగా ఎడ్లలంక గ్రామ సర్పంచ్ పాలెపు సామ్రాజ్యం, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ గ్రామస్తులు దీక్ష శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపారు

# ఈక్రాప్‌తోపాటు ఈకెవైసి తప్పనిసరి



**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం తుమ్మల పాలెం ఏరియా పరిధిలో గురువారం గూడూరు మండల తహసీల్దార్ బి. విజయ్‌ప్రసాద్ స్థానిక మండల వ్యవసాయ అధికారి జి వి శివప్రసాద్ తో కలిసి పంట నమోదుని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదుతో పాటు ఈకెవైసీ కూడా చేయించు కోవాలని కోరారు. దీని వలన ధాన్యం కొనుగోలు సమయం లో ఎటువంటి ఇబ్బంది వుండదని, రైతులు తప్పకుండ ఆధార్ తో అనుసంధానం అయిన బ్యాంకు పాసుబుక్ ఫోటో స్టాట్ కాపీ తో పాటు ఆధార్ కార్డు లేదా ఆధార్ తో లింక్ అయిన మొబైల్ ఫోన్ ని తీసుకొని రైతు భరోసా కేంద్రం లో వేలిముద్ర వేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఎరువుల విషయంలో పక్క వారిని చూసి అదికం గా ఎరువులు వాడటం తగ్గించాలన్నారు. ప్రస్తుతం పోటాష్ కలిసిన ఎరువులు వాడాలన్నారు, దీని వల్ల ముంపు కి గురైన పొలం లోని వరి మొక్కలు పాడై పోకుండా వుంటాయన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రవీంద్ర, వి అర్ ఓ బషీర్, రైతులు నరసింహారావ్, బాలు పాల్గొన్నారు.

# మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం బోళ్లపాడులో రైతులతో సమావేశం నిర్వహించి వరి, చెరకు సాగులో మెళకువలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. వరిలో సామూహిక ఎలుకల నివారణకు చేపట్టవలసిన పద్ధతులను ఉయ్యూరు చెరకు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి తెలియజేశారు. పొలంబడి ఉద్దేశం, ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాస్, ఏపీసీఎన్ ఎఫ్ డీపీఎం పార్థసారథి, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, మండల వ్యవసాయ అధికారి బి.నిస్సీగ్రేస్, వీఏఏ రఘు తదితరులు పాల్గొన్నారు.



సాగులో మెళకువలు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-గన్నవరం :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కె.వి శ్రీనివాస ఫీడర్ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసిపిడిసిఎల్ గుణదల కార్య నిర్వాహక ఇంజనీర్ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దావాజీగూడెం, అల్లాపురం, పామర్తి నగర్ సెంటర్, పాలిటెక్నికల్ కాలేజ్ రోడ్డు, రైస్ మిల్ బజార్, రాజీవ్ కాలనీ, ఎస్ టి బి ఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డు. ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**ఓటర్ల జాబితా పరిశీలనలో**

# రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలి : కలెక్టర్



నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు రాజకీయ పార్టీ నాయకులను కోరారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 14,68,176 మంది ఓటర్లకు గాను 12,44,681 మంది ఓటర్లను ఇంటింటికి తిరిగి ఆన్లైన్ లో బిఎల్ఓ యాప్ ద్వారా వెరిఫై చేయటం జరిగిందన్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటికి ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన 85 శాతం పూర్తయిందని, త్వరలో మిగిలిన వెరిఫికేషన్ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) నిర్వహిస్తున్న ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనలో ఆయా నియోజకవర్గాల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం అయ్యి, పక్కాగా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6, తొలగింపునకు ఫారం 7, మార్పులు చేర్పుల కోసం ఫారం 8 ఇస్తూ ఈ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని, గుర్తించిన సమస్యలను జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకురావాల్సిందిగా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఈ సమావేశంలో బి జే పీ,కాంగ్రెస్, సిపిఎం, టిడిపి, జనసేన, పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) :** హనుమాన్‌జంక్షన్ శివారు పోలవరం కాలువలో షుమారు 35 నుంచి 40 సంవత్సరాల గల గుర్తుతెలియని మగ వ్యక్తి మతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం రావడంతో వెంటనే హనుమాన్ జంక్షన్ ఎస్సై జనార్ధన్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి మతదేహాన్ని కాలువలోనుండి బయటకు తీశారు. మతదేహంపై బిస్కెట్ కలర్ పైన నలుపురంగు పూలు గల ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు ప్యాంటు, రెండు పేటల ఎరుపు రంగు మొలత్రాడు కలిగియుండి ఎత్తు సుమారు 5'5 అడుగులు కలిగియున్నాడని ఎస్ఐ తెలిపారు. మతదేహం గుర్తు పట్టడానికి వీలులేకుండా ఉందని, మతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.

## ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో చోరీ



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-గుడివాడ :** స్థానిక బేతవోలులోని శ్రీ ఆనందేశ్వరస్వామి వారి దేవస్థానంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. సీసీ కెమెరాలను పక్కకు నెట్టిన దుండగులు దేవస్థాన ప్రాంగణంలోని హుండీని పగలగొట్టి డబ్బును దొంగిలిచారు. గురువారం బోతవోలులోని చోరి జరిగిన దేవస్థానంలో గుడివాడ డియస్‌పి శ్రీకాంత్ తన సిబ్బందితో పరిశీలించారు. మచిలీపట్నం నుండి ఫోరెన్సిక్ బందం ఆధారలు సేకరించే పనిలో నిమగ్న మయారు. ఈ సందర్భంగా డియస్‌పి శ్రీకాంత్ మాట్లాడుతూ దేవస్థానంలోని స్వామివారి గర్భాలయ తలుపులను గుర్తు తెలియాని దుండుగులు గుణపాలతో తెరిచేందుకు విఫల యత్నం చెందారన్నారు. ఉదయం దేవస్థానానికి వచ్చిన అర్చకులు దేవస్థానంలో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. హుండీలో నగదు దోచుకోవడంతో పాటు సిసి కెమెరాల హార్డ్ డిస్క్ దొంగలు ఎత్తుకు వెళ్ళినట్లు దేవదాయ శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

## విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గురువారం అవనిగడ్డలోని అవనిగడ కె.వి సబ్ స్టేషన్ దగ్గర సబ్ స్టేషన్ ఆపరేటర్లు వాచ్మెన్లు ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న దాదాపు ముప్పై వేల మంది ఉద్యోగులు గతంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా ఉన్నారని, అప్పటి ప్రభుత్వం జీవో నెంబర్ 11 ద్వారా వీళ్ళందర్నీ అవుట్సోర్సింగ్ ఉద్యోగులుగా ప్రభుత్వ మార్చడం వల్ల ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయంతో వీళ్ళు ఉద్యోగాలు కూడా రెగ్యులర్ అయ్యే అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగుల సమాన పనికి సమాన వేతనం అనే నినాదం ద్వారా రాష్ట్రంలోని ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు అందరిని వారి అర్హతలను బట్టి రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. వీరికి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ధర్నాలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రదీప్, మాచవరపు శ్రీనివాసరావు, సైకం నరేంద్రబాబు, చలమలశెట్టి గంగాధర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు


మాట్లాడుతున్న సోమేశ్వర రావు

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

### ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు

**ప్రజాశక్తి - మైలవరం :** విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు విమర్శించారు. నూజివీడు రోడ్‌లోని గాంధీ గ్రంథాలయంలో గురువారం ఎస్ఎఫ్ఐ మండల ప్లీనరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలు రాకపోవటంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. నాడు నేడు పేరుతో ప్రభుత్వం పాఠశాలలో అభివద్ధి చేస్తామని చెబుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పనులు కాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు అన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మైలవరం మండలం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎం చరణ్, కార్యదర్శిగా వి విజయలను ఎన్నుకొన్నారు. మరో ఏడుగురిని మండల కార్యదర్శి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం కుమార్ నాయక్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


## యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

### మాజీ మంత్రి దేవినేని ఉమా



మాట్లాడుతున్న దేవినేని ఉమా

**ప్రజాశక్తి - మైలవరం :** టిడిపి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాద యాత్రను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో ప్రభుత్వం సైకో చేష్టలు చివరి స్టేజ్‌కు చేరుకున్నాయన్నారు. తిరుమలకు వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహ రిస్తుందన్నారు.


నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

## నాడునేడు బిల్లులు వెంటనే చెల్లించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాశక్తి- నందిగామ :** నాడునేడు బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ మండలంలోని రుద్రవరం జిల్లా పరిషత్ పాఠశాలలు తెరిచి రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు పెండింగ్లో ఉన్న నాడునేడు పనులు పూర్తి చేయకుండా, బిల్లులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం చాలా విచారకరమని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపినాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి నాడు నేడు బిల్లులు చెల్లించి బాలికలకు ప్రత్యేకంగా బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థులకు సన్న బియ్యం సరాఫరా చేయాలని కోరారు. మినరల్ వాటరు సరాఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ఐ నాయకులు షేక్.జాహిదా, హుషేన్, షేక్. ఖాజ, రఘు, నాయకులు పాల్గొన్నారు.

## ఎపిపిఎస్‌సి గ్రూప్-1 ఫలితాల్లో శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



విలేకరుల సమావేశంలో శరత్ చంద్ర, ర్యాంకర్ లక్ష్మీ ప్రసన్న

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ఎపిపిఎస్‌సి గ్రూప్ -1 పరీక్షా ఫలితాల్లో నగరంలోని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమిలో శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు లభించాయని శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర తెలిపారు. గురువారం సాయంత్రం ఎం.జి.రోడ్డులోని అకాడమి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ -1 ఫలితాల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి అత్యధికంగా ర్యాంకులు రావడం, అందులో మహిళలు ప్రతిభ చాటడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద గైడెన్స్ తీసుకున్న 48 మంది విద్యార్థులకు ర్యాంకులు రావడం ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. తమ వద్ద శిక్షణ తీసుకున్న లక్ష్మీ ప్రసన్న పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూనే ఎంతో కష్టపడి చదివిందన్నారు. ఆమెకు డిప్యూటీ కలెక్టర్‌గా రావడం గమనార్హమన్నారు. శివ ప్రియ, ఉదయ పావని, అష్రఫ్, గద్దె వెంకటేష్‌లు ఇఎస్‌పి వచ్చిందని తెలిపారు. అలాగే గ్రూప్ -2, గ్రూప్ -3, గ్రూప్ -4 ఉద్యోగాల్లో ఉన్న వారు ఎందరో కష్టపడి చదివి ఈసంవత్సరం గ్రూప్ -1 ర్యాంకులు సాధించారని తెలిపారు. అధిక శాతం సుమారు 23 సంవత్సరాల వయసుగల వారు ర్యాంకులు సాధించారని అన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థిలో వివిధ నైపుణ్యాలను పరీక్షించగలిగారని తెలిపారు. యుపిఎస్‌సిసివిల్ సర్వీసెస్ తరహాలోనే ప్రశ్నలు ఉండటం వలన ఎపిపిఎస్‌సి వారు అభ్యర్థిలోని విశ్లేషణాత్మక నైపుణ్యాన్ని బాగా పరీక్షించారని తెలిపారు.

## నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం 22వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పైపులైన్ల పనుల శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. స్థానిక నాయకులు అంకం మెహనరావు, గుంజా శ్రీను, నల్లమోతు ప్రకాష్, నల్లమోతు చిన్నయ్య, దయాకర్ వెంకట రత్నం, పండు,రాధా, మొదలైన నాయకులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎఇ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. 9వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్, ఎఇ పరిశీలించారు. ఇబ్రహీంపట్నంలో ముస్లిం షాదీఖానా, భీమరాజు గుట్టలో ఎంపి (ఎల్ఎస్) నిధులతో నిర్మాణంలో ఉన్న రెండు కమ్యూనిటీ హాళ్లను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఎఇ పరిశీలించారు.


రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

## 22న ద్వి సహస్ర గళ పద్యార్చన



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** తెలుగు వారి మొదటి కావ్యం మహాభారతం అవతరించి వెయ్యేళ్ళు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన 'ద్వి సహస్ర గళ పద్యార్చన' నిర్వహించనున్నట్లు కెబిఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ తూనుకుంట్ల శ్రీనివాసు చెప్పారు. గురువారం కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహంతో నన్నయ 1023వ సంవత్సరంలో మహాభారత రచన చేశాడని, ఆ రచన జరిగి ఈ ఏడాదితో వెయ్యి సంవత్సరాలు పూర్తికావటం చారిత్రాత్మక సంఘటనగా నిలుస్తుందని అన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం గం. 4లకు తమ కళాశాలలో జరిగే కార్యక్రమంలో రెండు వేల మంది విద్యార్థులు ఒకేసారి 108 పద్యాలు చదువుతారన్నారు. అదే రోజు ఉదయం గం.7.30లకు వెయ్యి మంది విద్యార్థులతో కాలేజీ నుంచి తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వరకు మహాభారత శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. శోభాయాత్రను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, మహాభారత గ్రంథాలను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా వెళ్ళి తెలుగుతల్లి పాదాలకు సమర్పిస్తామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ గరికిపాటి నరసింహారావు, నగర ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమ వివరాలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు.

## లోకేష్ పాదయాత్రకు స్వాగత ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎంఎస్ బేగ్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఉమ్మడి కష్ణాజిల్లాలో లోకేష్ పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుదామని తెలుగుదేశం శ్రేణులకు టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం బుద్దా వెంకన్న ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో యువగళం పాదయాత్ర ఉంటుందన్నారు. వేలాది మందితో గన్నవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కె.నాగుల్‌మీరా, కార్పొరేటర్ ముమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) తదితరులు పాల్గొన్నారు. యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలని కోరుతూ గురువారం 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) తన ద్విచక్ర వాహనానికి ఫ్లకార్డు తగిలించి వినూత్న ప్రచారం నిర్వహించారు. టిడిపి యువ నాయకులు నారా లోకేష్ యువగళ పాదయాత్ర ప్రకాశం బ్యారేజీ మీదుగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు, పార్టీ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జలీల్‌ఖాన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో మైనార్టీ నాయకులు ఎం.ఎస్ బేగ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోకేష్ యువగళ పాదయాత్ర ఉమ్మడి కృష్ణా జిల్లా, విజయవాడకు చేరుకుంటున్న సందర్భంగా ఆయనకు భారీగా ఘన స్వాగతం పలకాలని,దీనికై నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క గడపకు వెళ్లి లోకేష్ పాదయాత్ర గురించి వివరిస్తామని టిడిపి పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనంపై ఫ్లకార్డుతో ప్రచారం

## ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - వత్సవాయి :** మండల కేంద్రమైన వత్సవాయిలో ఈనెల 20వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు తెలిపారు. శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సిటీ నర్సింగ్ హోమ్ వైద్యుల సమక్షంలో షుగరు, గుండె పరీక్షలు ఉచితంగా చూడబడనని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని చేసుకోవాలని కోరారు.

## కుంకుమ పూజలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం పురస్కరించుకొని, గురువారం నుండి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన ప్రత్యేక కుంకుమార్చన సేవలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ పాల్గొన్నారు. శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించుచున్న ఈ ప్రత్యేక కుంకుమార్చన సేవ యందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పలువురు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి శ్రీ అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.


కల్యాణ మండప శంకస్థాపనలో ఎమ్మెల్యే వెలంపల్లి

## తమ్మిన పోతురాజు కళ్యాణ మండపానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** 48వ డివిజన్ ట్రైనర్ పేట అడ్డరోడ్డులో ఉన్న తమ్మిన పోతురాజు కళ్యాణ మండపంపై అంతస్తును రూ.42.45 లక్షలతో నిర్మాణానికి గురువారం పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌ను మూడు నెలల్లో పూర్తి చేసేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ట్యాంక్ నిర్మించి మంచినీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. మెట్ల మార్గాలు అభివద్ధి చేశామన్నారు. మూడు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నియోజకవర్గం అభివద్ధికి కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, వైసీపీ నాయకులు అత్తలూరి పెద్దబాబు, పిళ్ళా సూరిబాబు, పాల్గొన్నారు.

## జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు ట్రయల్స్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** జనవరి 2008 నుండి డిసెంబర్ 2009 మధ్య జన్మించిన బాలికలు, బాలుర కోసం జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ట్రయల్స్ 20 ఆగస్టున గన్నవరంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ తెలిపారు. అర్హత గల ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని తమ ఫుట్‌బాల్ నైపుణ్యాలను చూపాలని కష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, జి.అనిల్ కుమార్, కార్యదర్శి, ఆర్ సురేష్ మీడియాకు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీని తీసుకురావాలని సూచించారు.

# రేపు పంచాయతీ ఎన్నికలు

● ఒక సర్పంచ్, 8 వార్డు పదవులకు సన్నాహాలు పూర్తి ● ఎన్నిక రోజే ఫలితాలు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)** : జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు జిల్లా పంచాయతీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కృష్ణా జిల్లాలో మొత్తం రెండు సర్పంచ్ స్థానాలకు 31 వార్డ్ మెంబర్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా ఒక సర్పంచ్ మరియు 28 వార్డు మెంబర్లు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన ఒక సర్పంచ్ ఎనిమిది వార్డు మెంబర్లకు ఈనెల 19న ఎన్నిక జరగనుంది. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని అనంతరం రెండు గంటలకు ఫలితాలు వెల్లడి చేస్తారు. వీటిలో పెడన మండలం కొంగం చర్ల గ్రామ సర్పంచ్( జనరల్ మహిళ) స్థానానికి ఎన్నిక జరగనుండగా, అలాగే మిగిలిన 8 వార్డులకు సంబంధించి బాపులపాడు మండలం మల్లవల్లి పంచాయతీలో 6వ వార్డు (ఎస్సి), ఉంగుటూరు మండలం తాళ్లప్రోలు గ్రామపంచాయతీ 4వ వార్డ్, (జనరల్) బంటుమిల్లి మండలంలో బంటుమిల్లి 4 వార్డ్( ఎస్ సి,మహిళ) గూడూరు మండలం పోలవరంలో ,11వ వార్డు(జనరల్ మహిళ ) పెడన మండలంలో కాకర్ల ముడి లో 4వార్డ్ ( బి సి,మహిళ ) కంకిపాడు పంచాయతీలో 9, వార్డ్(జనరల్) పమిడిముక్కల మండల పరిధిలోని అలినక్కిపాలెం 6 వార్డ్ (జనరల్ మహిళ ),వుయ్యూరు మండలం గండి గుంట పంచాయతీలో 10 వార్డ్ (బి సి)కు ఎన్నికలు జరగనున్నాయి. ఒక సర్పంచ్ స్థానిక ఇద్దరు అభ్యర్థులు పోటీ పడగా,8 వార్డులకు 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.వీటిలో కంకిపాడు పంచాయతీ వార్డుకు ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికలలో మొత్తం 3236 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం పది పోలింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేశారు.ఎన్నకల ప్రక్రియ సజావుగా జరిగేందుకు తొమ్మిది మంది రిటర్నింగ్ అధికారులను, తొమ్మిదిమంది పోలింగ్ అధికారులను ,మరో 31 మంది సహాయ పోలింగ్ అధికారులను నియమించారు.

**"నాలుగు "అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు** : ఎన్నికలు జరగనున్న ఆయ గ్రామాల్లో నాలుగు అత్యంత, ఐదు సమస్యాత్మక కేంద్రాలు గా విభజించారు.రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెడన నియోజక వర్గం లోనే అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సర్పంచ్ స్థానానికి జరిగే కొంగం చర్ల,తో పాటు బంటుమిల్లి, పోలవరం, కాకర్ల ముడి వార్డుకు ఉన్నాయి.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం**

**జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్**



ఈ నెల 19 న జిల్లాలో జరుగుతున్న ఒక సర్పంచ్, ఎనిమిది వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి ఎన్ వి.నాగేశ్వర్ నాయక్ తెలిపారు. ఎన్నికల రోజు ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు,పాటు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అలాగే ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు.కాబట్టి ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## గడిగుంటలో ముగిసిన ప్రచారం

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : గండిగుంట గ్రామ పంచాయతీ 10వ వార్డు సభ్యుని ఎన్నికకు ప్రచారం గురువారం ముగిసింది. తెలుగుదేశం మద్దతుతో వీరంకి పాండురంగారావు, వైసిపి మద్దతుతో మోర్ల యోగీశ్వరరావు పోటీలో నిలవగా ఇరువురు అభ్యర్థుల తరఫున మద్దతునిచ్చిన పార్టీల స్థానిక నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరుపార్టీలు గ్రామంలో ఈఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే ధ్యేయంగా పని చేస్తున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అధికార పార్టీ అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలాఉండగా గ్రామంలో 10వ వార్డు సభ్యుని ఎన్నికకు శనివారం పోలింగ్ జరుగనుండగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి విమాదేవి పోలింగ్ బ్యూత్ను పరిశీలించారు.

## అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

**ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)** : గ్రామ పంచాయతీ ఉప ఎన్నికలలో భాగంగా ఉంగుటూరు మండలం తేలప్రోలు 4 వార్డుకు పోటీలో ఉన్న అభ్యర్థులు గుల్లిపల్లి సందీప్‌కు ప్రెషర్ కుక్కర్ గుర్తు, వింత శ్రీనివాస రెడ్డికి గౌను గుర్తు కేటాయించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. తేలప్రోలు 4వ వార్డుకు ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు కౌంటింగ్ ప్రకియ జరుగుతుందన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-గుడివాడ** : విద్యారంగ అభివృద్ధికై, విద్యార్థులకు ప్రభుత్వం నుండి రావలసిన మౌలిక వసతులు, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలను అమలు చేయనివ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని విద్యార్థి ఎస్ఎఫ్ఐ కమిటి సభ్యుడు ఎస్.సమీర్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్రలో భాగంగా స్థానికి ఏలూరురోడ్డులోని రిషి కళాశాల వద్ద విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ జీవో నెంబర్ 107,108లను రద్దు చేయాలని, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ చదువుతున్న




విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు అందించాలని, నాడు -నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెట్ల వేలంపాట

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతిగదుల నిర్మాణానికి అడ్డుగా ఉన్న 36 వివిధ రకాల చెట్లు తొలగించుటకు శనివారం సాయంత్రం 4 గంటలకు పాఠశాల ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, విద్యాకమిటీ అధ్యక్షుడు టి.సుధాకర్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## హోమియో మాత్రలు పంపిణీ

**ప్రజాశక్తి- ఉయ్యూరు** : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా వైరల్ ఫీవర్, ఇతర వ్యాధులు ప్రబలకుండా నియంత్రించుకోవచ్చని రోటరీక్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ సంగం తిరుమలరావు, ప్రస్తుత ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు సూచించారు. విషజ్వరాల నియంత్రణకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆకునూరు ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం హెూమియో మాత్రలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉయ్యూరులో మండల పరిషత్ ఉర్దూ పాఠశాల, మంటాడలో ప్రాథమిక పాఠశాలలో కూడా విద్యార్థులకు మందులు పంపిణీ చేశామన్నారు. క్లబ్ సెక్రటరీ సుబ్రమణ్యం పాల్గొని సేవలందించారు

దేవాలయ భూములసాగుదారులకు

# సిసిఆర్‌సి కార్డులివ్వాలి

● కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు



మాట్లాడుతున్న ఎం.హరిబాబు

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : దేవాలయ భూములను కౌలుకు సాగు చేస్తున్న కౌలుదారులందరికి కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు అన్నారు. గురువారం తోట్లవల్లూరు శివాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరికి కౌలు కార్డు ఇవ్వాలని ఆయన కోరారు. ఆరుగాలం కష్టించి దేశానికి అన్నం పెట్టె రైతుకు గోడ దెబ్బ చెంపదెబ్బ లాగా వాతావరణ సమతుల్యం లోపించి అప్పటికప్పుడే అకాల వర్షాలు అప్పటికప్పుడే విపరీత ఎండలు రావడంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. అధిక వర్షాల వల్ల పంటలు మొనకకు గుర్రై పాడైపో తున్నాయని, మండుటెండల వల్ల పంటలు ఎండిపోతున్నాయని దీంతో అగమ్య గోచరంగా రైతు పరిస్థితి తయారయిందని దీనిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరికి సిసిఆర్సి కార్డులు ఇప్పించాలని అన్నారు. ప్రస్తుత కాలంలో వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని, విపరీతంగా ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడం ఒక కారణమైతే మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం రైతుల్ని అతలాకుతలం చేస్తున్నాయని దీనివల్ల వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని అన్నారు. దేవాలయ భూములు సాగు చేసే కౌలు రైతులకు కార్డులు ఇవ్వడానికి పత్రంలో భూ యజమాని సంతకం అని ఉన్న ప్రాంతంలో దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి గాని దానికి సంబంధించిన అధికారి గాని సంతకం పెట్టి కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్డు వచ్చిన ప్రతి ఒక్కరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని, పంట నష్టపరిహారం, పంటల భీమా అందేలా చేయాలని కోరారు. రాష్ట్రంలో దేవాలయ భూములు సాగు చేసే కొన్ని వేల మందికి సిసిఆర్సి కార్డులు ఇవ్వలేదని వారందరికి ఇచ్చేలా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కౌలు రైతు సంఘం తరపున వినతిపత్రం అందించామని ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకొని కౌలు గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు. రాష్ట్రంలో కౌలు రైతు సంఘం తరపున గ్రామ గ్రామాన తిరిగి దేవాలయ భూములు సాగు చేసే కౌలు రైతులకు కార్డులు ఇప్పించేలా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమతో నడిచి కౌలు గుర్తింపు కార్డులు పొందాలని కోరారు.కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. శివ నాగేంద్రం,అద్దేపల్లి శ్రీమన్నారాయణ, వీరంకి శ్రీనివాసరావు ఏమి నేని లెనిన్ బాబు అంబటి శ్రీనివాసరావు, మారుమూడి సుబ్బారావు, ఆసిలేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న పాలడుగు నాని

## పాల సంఘాలకు బోనస్ పంపిణీ

**ప్రజాశక్తి-గన్నవరం** : కృష్ణ మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గన్నవరం క్లస్టర్ పరిధిలో 124 గ్రామాల పాల సంఘాలకు గురువారం గన్నవరంలోని ఫీల్డ్ మిక్సింగ్ ప్లాంట్‌లో రూ. 90,90,500 బోనస్ పంపిణీ చెక్కులను పంపిణీ చేశారు. దాసరి వెంకట బాలవర్ధనరావు, పాలడుగు నాని మాట్లాడుతూ.. జిల్లాలో రైతుల సంక్షేమానికి కృష్ణ మిల్క్ యూనియన్ పెద్దపీట వేస్తుందని చెప్పారు. యూనియన్‌కు వచ్చే లాభాల్లో కొంత వాటాను రైతులకు బోనస్ గా పంపిణీ చేసి వారిని ఆదుకుంటున్నట్లు తెలిపారు. పాడి రైతులు బాగుంటేనే రాష్ట్రంతో పాటు రైతు కుటుంబాలు బాగుంటాయన్నారు. ప్రైవేటు డైరీలను నమ్మవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు చలసాని. చక్రపాణి , పి వి ఆర్ వి ప్రసాద్, పలగాని కొండలరావు , ట్రస్ట్ సభ్యులు హరి రామ కోటి రెడ్డి, పునుకొల్లు. రత్న ప్రసాద్( నాని) , ఫీడ్ కమిటీ సభ్యులు శివరాం ప్రసాద్, కృష్ణ మిల్క్ యూనియన్ జనరల్ మేనేజర్ జి అనిల్ కుమార్, గన్నవరం క్లస్టర్ మేనేజర్ ప్రసాద్ , ఏఎంపిఓ షేక్ యాసిన్ , సూపర్వైజర్స్ కే తరుణ్ కుమార్, పి . రాజీవ్, జె . సుభాకర్, బి నరసింహారావు, వివిధ గ్రామాల సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

## 22న యువగళం పాదయాత్ర గన్నవరం రాక

**ప్రజాశక్తి-గన్నవరం** : ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు ఉమ్మడి కృష్ణాజిల్లా లోకి యువ నాయకుడు నారా లోకేష్ యువగళం పాదయాత్ర అడుగిడుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా తెలిపారు. 19,20,21, 22 తేదీల్లో ఈ నాలుగు రోజులు ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. 21వ తేదీన నిడమనూరు నుండి గన్నవరం ఎస్ఎం కన్వెన్షన్ వరకు పర్యటన కొనసాగుతుందని చెప్పారు. 22వ తేదీన గన్నవరం ఎస్ఎం కన్వెన్షన్ పక్కన గల ప్రాంగణంలో భారీ బహిరంగ సభ సాయంత్రం 3.30 నిమిషాలకు ఉంటుందన్నారు.

## మళ్లీ వైసిపిదే విజయం : కైలే

**ప్రజాశక్తి-పమిడిముక్కల** : వచ్చే ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపి పార్టీ ఘన విజయం సాధిస్తుందని, ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురంలో గడపగడపకు కార్యక్రమం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, కులం మతం పార్టీ తేడా లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తు న్నామన్నారు. కృష్ణాపురం గ్రామ అభివృద్ధి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల జడ్పీటీసీ ఏనుగు వెంకటరమణకుమారి, మండల ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, సచివాలయం కన్వీనర్ పర్స జగన్, వైయస్సార్ పార్టీ నాయకులు బండ్రపల్లి శ్యామ్, వీరంకి చిరంజీవి, వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, మారపాక మహేష్‌రావు, సొంటి వెంకటేశ్వరరావు, పెనుముచ్చ రమేష్, దిమ్మెట రాంబాబు అగ్నిపర్ గ్రామ సర్పంచ్ కోట మణిరాజ్ గొరికిపూడి బుజ్జి కొడాలి రాంబాబు మర్రి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలపై

# 30 నుండి ప్రజా ఉద్యమం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి - గన్నవరం :** కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, అధిక ధరలను నియంత్రించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. గన్నవరంలోని అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో గురువారం 'ప్రజా సమస్యలు – సిపిఎం పోరు'పై గన్నవరం నియోజకవర్గ స్థాయి విస్తత సమావేశం నిర్వహించారు. సిపిఎం నాయకులు బేతా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తోందని, మరోవైపు పేదలపై పన్నులు భారాలను మోపుతోందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే రుణాలకు అనుమతి ఇచ్చేదిలేదని బెదిరిస్తోందని అన్నారు. ఈ విధానాలను రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తోందన్నారు. కేంద్రం చెప్పిన విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యావసరాలు అందించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమం చేపడుతున్నామని తెలిపారు. సిపిఎం కష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో అనేక ప్రధాన సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులతోపాటు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోలవరం కాల్వ నీటిని సాగునీటి చెరువులకు మళ్లించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. గతంలో ఎంఎల్ఎ వంశీ మోటార్లను పెట్టి నీటిని తరలించిన పరిస్థితి ఉందని, ఇప్పుడు మోటార్లు లేని కారణంగా చెరువుల్లోకి నీరు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. అందువల్ల ఎంఎల్ఎ వంశీ నీటి తరలింపునకు బాధ్యత తీసుకోవాలని కోరారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో పేదలకు అసైన్డ్ పట్టాలిచ్చి ఏళ్లు గడుస్తున్నా భూములు ఎక్కడ ఉన్నాయో చూపించలేదన్నారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పట్టాదారులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. జగనన్న కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉంగుటూరు– లంకపల్లి మధ్యలో బుడమేరుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో చెత్త డంపింగ్ యార్డ్‌కు అవసరమైన స్థలాన్ని కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఫలితంగా ఆగిరిపల్లి రోడ్డులో చెత్త కుప్పలు వేయడం వల్ల జనాలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు బజారులో వాస్తవ రైతులు ఎక్కువమంది లేకపోవడం వల్ల ధరలు సక్రమంగా ఉండడం లేదన్నారు. గత నాలుగేళ్లలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పారు. డెల్టా ప్రాంతంలోనూ నీరు లేక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఈసమావేశంలో సిపిఎం నాయకులు కె.వెంకటేశ్వరరావు, టివి.లక్ష్మణ స్వామి, మల్లంపల్లి ఆంజనేయులు, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు; చిత్రంలో వై.నరసింహారావు, ఆర్.రఘు తదితరులు

### జుజ్జూరు మండల కేంద్రంగా నోటిఫికేషన్

**ప్రజాశక్తి -వీరులపాడు :** మండల కేంద్రంగా జుజ్జూరును అమలు చేసి కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం నుండి జుజ్జూరు మండల కేంద్రంగా అమలులోకి వస్తుందని నోటిఫికేషన్లో పేర్కొంది. ఇప్పటి వరకు మండల కేంద్రంగా ఉన్న వీరులపాడులోని మండల కార్యాలయాలను జుజ్జూరుకు తరలించాలని తెలిపింది.

## విగ్రహాల తొలగింపుపై టిడిపి నిరసన

### అడ్డుకునేందుకు పోలీసుల యత్నం

### హైకోర్టు తీర్పు మేరకే తొలగింపు : ఎంఎల్‌సి అరుణ్

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ గాంధీ సెంటర్లో విగ్రహాల తొలగింపుకు నిరసనగా గురువారం ప్రదర్శన చేపట్టిన టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నందిగామలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ఇంటి వద్ద నుండి నిరసన ప్రదర్శనగా వస్తున్న టిడిపి శ్రేణులను రోడ్డుపైకి రావడానికి వీల్లేదంటూ పోలీసులను మోహరించడంతో తోపులాట జరిగింది. పోలీసుల నుండి టిడిపి నేతలు, కార్యకర్తలు తప్పించుకొని మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య, టిడిపి పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**టిడిపి నేతలు అభివృద్ధి నిరోధకులు : ఎంఎల్‌సి అరుణ్‌కుమార్**

నందిగామ పట్టణాన్ని అభివద్ధి చేస్తుంటే టిడిపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ విమర్శించారు. విగ్రహాల తొలగింపు అనంతరం గురువారం ఆయన ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అరుణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకే ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న విగ్రహాలను మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. నందిగామ గాంధీ సెంటర్‌ను అభివద్ధి చేయాలని ఆశించామని, అయితే ఎక్కడ తమకు మంచి పేరు వస్తుందోనని ఓర్వలేక టిడిపి పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీలు, విద్యావేత్తల, పట్టణ ప్రముఖుల అభిప్రాయాలను తీసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి ప్రతినిధులు పాల్గొని తాము అభివద్ధికి అడ్డుపడటం లేదని తెలిపారని వివరించారు. హైకోర్టు తీర్పు ప్రకారం, మెజారిటీ ప్రతినిధుల అభిప్రాయాల ప్రకారం...విగ్రహాలను తొలగించి ఆస్పత్రి స్థలంలో ఏర్పాటు చేసిన ప్లాట్ ఫాంపై విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

## మున్నేరు ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

మున్నేరు ఆయకట్టు రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆయకట్టు రైతులకు భరోసా కల్పించాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఉధృతంగా వచ్చిన వరదలకు మున్నేరు ఆనకట్టకు గండ్లు పడ్డాయని తెలిపారు. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మున్నేరుపై నిర్మించిన ఆనకట్ట శిథిలావస్థకు చేరుకుందన్నారు. పాత ఆనకట్టపై కూడా 20 మీటర్లకుపైగా కాంక్రీటు దెబ్బతిన్నదన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహిస్తేనే రైతులకు సాగు నీరందుతుందన్నారు. కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ మున్నేరు ఆయకట్టు కింద 26 వేల ఎకరాలు సాగవుతున్నాయని తెలిపారు. రైతులు మిర్చి, వరి, పత్తి పంటలు సాగు చేసేందుకు 2.5 టిఎంసిల సాగు నీరు అవసరమవుతుందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు సాగు నీరందించినప్పుడే పంటలు పండుతాయని పేర్కొన్నారు. గట్లకు పడిన గండ్లకు మరమ్మతులు నిర్వహించకపోతే ఆయకట్టు పరిధిలో సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకులు సిహెచ్.హనుమంతరావు మాట్లాడుతూ మున్నేరు ఆనకట్టకు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లుగా తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఆనకట్ట మరమ్మతులకు రూ.2 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు అంచనాలు రూపొందంచకుండా, ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మున్నేరు ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు రాంబాబు, గురవయ్య, నాగేశ్వరరావు, రమేష్, నరసింహారావు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు గురువారం మచిలీపట్నం తాసిల్దార్ కార్యాలయం సందర్శించి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్ కార్యక్రమం లో భాగంగా బందరు నియోజకవర్గంలో వెరిఫికేషన్ ప్రక్రియ తాజా స్థితి, వెరిఫికేషన్ నిర్వహించిన విధానం సంబంధిత రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో మరణించిన ఓటర్ల పేర్లు తొలగింపు, డబల్ ఎంట్రీలు ఉన్న పేర్లలో ఒకచోట తొలగింపు, షిఫ్టింగ్ ఓటర్లు తదితర సందర్భాల్లో బి ఎల్ ఓలు ఏ విధమైన చర్యలు తీసుకున్నారో , వారు నిర్వహించిన రికార్డు రాండం తనిఖీ చేసిన కలెక్టర్ రికార్డ్ నిర్వహణ పట్ల అసంతప్తి వ్యక్తం చేస్తూ, రికార్డు సరిగా నిర్వహించలేదని, వారం రోజుల్లో రివెరిఫికేషన్ నిర్వహించాలని కలెక్టర్ ఆర్డిఓను ఆదేశించారు. రికార్డు సరిగా నిర్వహించని బిఎల్ఓ లను పర్యవేక్షకులను బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ డోర్ నెంబర్ తో 10 కంటే ఎక్కువ ఓటర్ల నమోదు సందర్భాల్లో బిఎల్ వోలు ఏ విధమైన చర్యలు తీసుకున్నారు, వారు నిర్వహించిన రికార్డు కలెక్టర్ పరిశీలించారు .వెరిఫికేషన్ అనంతరం డేటా ఆన్లైన్ నమోదు ఆపరేటర్ లాగిన్ నుండి అప్రూవ్ అధికారి లాగిన్ వరకు ఏ విధంగా జరిగిందో కలెక్టర్ పరిశీలించారు. బందర్ ఆర్డీవో ఐ కిషోర్, తహసిల్దారు ఎం శ్రీవిద్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రయ్య, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు




## ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆందోళన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా గురువారం పటమట ఎన్టిఆర్ సర్కిల్ వద్ద మునిసిపల్ కార్మికులతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ మునిసిపల్ అండ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మునిసిపల్ వర్కర్స్ జీవితాలు బాగుపడే పరిస్థితులు కనపడటం లేదన్నారు. రోజులు గడుస్తున్నాయే తప్ప కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. నేను అధికారం చేపడితే లక్ష రూపాయలు ఇచ్చినా రుణం తీరదు అని చెప్పిన పెద్ద మనిషి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంచేపట్టినా ఆవిషయాలన్నీ పక్కన పెట్టేశారని అన్నారు. మూడు సార్లు సమ్మె చేస్తే తప్ప 21 వేలు జీతం ఇచ్చే పరిస్థితి కనపడటం లేదన్నారు. జీతమే కాదు ఆనాడు ఎన్నికలలో జగన్ పర్మినెంట్ చేస్తామని చెప్పారి ఈరోజు కార్మికులు అడుగుతున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 24వ తేదీన పెద్ద ఎత్తున కలెక్టరేట్లు, ముట్టడికి కూడా కార్మికులు సమాయత్తమవుతున్నారన్నారు. అంతింగా ఇదే చివరి శాంతియుత నిరసన అని తెలియచేశారు. ప్రభుత్వ పెద్దలు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోతే నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈకాలం వర్షాకాలం, కాలుష్యం, చెత్తతో నగరం నిండిపోయే కాలమన్నారు. ఈమూడు నెలలు చాలా తీవ్రమైన కాలుష్యం ఉంటుందన్నారు. ప్రజారోగ్యం దెబ్బతినేదానికి కారణ: మీరే అవుతారని హెచ్చరిస్తున్నామన్నారు. మునిసిపల్ కార్మికులకు నెరవేరాల్సిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. అన్ని సెక్షన్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 21వేలు ఇవ్వాలని , ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మునిసిపల్ కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారిని ఇన్సూరెన్‌ఃఉస వచ్చేలా ఇన్సూరెన్స్ కట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈడిమాండ్స్ అన్నింటికీ ఈనెల 24వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే నిరవధిక సమ్మె తప్పదన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు జ్యోతిబసు, పలువురు వర్కర్లు పాల్గొన్నారు.



ప్రచారంలో సర్పంచ్ అభ్యర్థి విజయలక్ష్మి

## సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

**ప్రజాశక్తి వత్సవాయి :** మండలాల్లోని పెద్దమోదుగుపల్లి గ్రామంలో జరిగే సర్పంచ్ ఉప ఎన్నికల్లో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కళ్యాణపు విజయలక్ష్మి ఎన్నికల గుర్తు "కత్తెర"పై ఓటు ముద్రను వేసి గెలిపించాలని, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి కళ్యాణపు విజయలక్ష్మి, ఎంపిపి రమాదేవి, జెడ్పిటిసి ఏసుపోగు దేవమని, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, వత్సవాయి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగి పోగు రమేష్, దళిత నాయకులు కనకపుడి భాస్కరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీని కైవసం చేసుకునేందుకు టిడిపి, వైసిపి నాయకులు గ్రామంలో విస్తత ప్రచారం చేస్తున్నారు.

## యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలి : కొల్లు

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ఈ నెల 19 నుండి కృష్ణాజిల్లాలో జరిగే యువగళం పాదయాత్ర, 22 గన్నవరం బహిరంగ సభ కు పార్టీ శ్రేణులంత పాల్గొని విజయవంతం చేద్దాం అని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావులు పిలుపు నిచ్చారు. గురువారం నియోజకవర్గ తెలుగుదేశం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ యువగళం పాదయాత్ర ఈ నెల 19 వ తారీకు కష్ణా జిల్లా ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటారు. నాలుగు రోజుల పాటు జిల్లాలో సాగే లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ, అధ్యక్ష కార్యదర్శులు, కార్పొరేటర్లు, క్లస్టర్, యూనిట్, డివిజన్ ఇంఛార్జి లు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

అలాగే ఈ నెల 19 వ తేదీనతేదీన ఉమ్మడి కష్ణా జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం అవుతున్న సందర్భంగా జిల్లాలోని దళితులంతా ఏకమై పాదయాత్రకు సంఘీభావం తెలపాలని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ తెలిపారు.స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆది నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కలపాల కిషోర్, మచిలీపట్నం టౌన్ అధ్యక్షురాలు దేవరపల్లి అనిత, వసంత,లింగం విజయ్ పాల్గొన్నారు.

## బస్సుయాత్రను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - మొవ్వ :** రాష్ట్రాన్ని రక్షించడం కోసం.. దేశాన్ని కాపాడడం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సిపిఐ ప్రచార జాత... బస్సు యాత్ర విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా సిపిఐ సమితి ఇన్చార్జి కార్యదర్శి టీ తాతయ్య పిలుపునిచ్చారు. మొవ్వ మండలం కూచిపూడి పెదపూడి సెంటర్లోని చలసాని కాంచన రావు సిపిఐ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈనెల 24న ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగే ఈ బస్సు యాత్ర 25న పెనమలూరు నియోజకవర్గం లోని తాటి గడప వద్ద కష్ణా జిల్లాలో ప్రవేశిస్తుందని పేర్కొన్నారు.

## ఎంఎల్ఏ అనవసర ప్రచారం మానుకోవాలి : బుద్ధప్రసాద్

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అనవసరపు ప్రేలాపనులు, గోబెల్స్ ప్రచారం మానుకోవాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. సముద్రపు కరకట్ట అభివద్ధిని డిమాండ్ చేస్తూ గురువారం బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో నాగాయలంక మండలం సంగమేశ్వరం గ్రామం నుంచి గుల్లల మో ద వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు నుంచి కష్ణా డెల్టా ఆధునీకరణ పనుల్లో అవినీతి జరిగిందంటూ పాట పాడుతున్న ఎమ్మెల్యే గెలిచిన తర్వాత కూడా అదే పాట పాడుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయితే ప్రభుత్వం దీనిమీద విచారణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అప్పుడు ప్రచారం చేయటం మాని ఇప్పటికైనా దమ్ము ధైర్యం ఉంటే ప్రభుత్వ సంస్థతో విచారణ నిర్వహించాలని లేకుంటే సిబిఐ విచారణ కూడా చేయించుకోవచ్చు అని సూచించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, నాగాయ లంక మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, బావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, మాజీ దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలవర్ధిరావు పాల్గొన్నారు.

## మోపిదేవిలంకలో 'నా భూమి.. నా దేశం'

**ప్రజాశక్తి-చల్లపల్లి :** మండల పరిధిలోని మోపిదేవిలంక గ్రామ పంచాయతీలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆజాదీకా అమత్ మహెూత్సవ్ కార్యక్రమంలో భాగంగా మోపిదేవి లంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, రైతు విభాగం జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావులు అతిథులుగా పాల్గొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి సందేశం తో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రమేష్ బాబు జాతికి అంకితం చేశారు. మట్టిని చేతపట్టి ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతిజ్ఞ చేశారు.అనంతరం పంచాయతీ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న తో కలిసి రమేష్ బాబు, నరసింహారావు లు మొక్కలు నాటారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎండిఓ రామలింగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎండిఒను సత్కరిస్తున్న ఉద్యోగులు

## ఎండిఒకు పలువురు అభినందనలు

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** ఎంపీడీవో స్వర్ణలతకు ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు రావడంపై మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు,అధికారులు, కార్యదర్శులు ఆమెను పూల బొకేలతో సన్మానించారు. మచిలీపట్నంలో 77వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కష్ణాజిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన స్వాతంత్ర వేడుకలలో కష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్, డాక్టర్‌బీ అపాజిత సింగ్, కష్ణా జిల్లా రెవిన్యూ అధికారి పి. వెంకటేశ్వర్లు చేతులు మీదుగా మెరిటేరియల్ అవార్డును అందుకున్నారు. తమ మండలంలో ఉత్తమ మండల పరిషత్ అభివద్ధికారునిగా పేరు తెచ్చుకోవడం పై పలువురు ఆమెను ప్రశంసించారు.

## ఉత్తమ తహశీల్దార్‌కు సత్కారం

**ప్రజాశక్తి- పెడన :** ఉత్తమ తాసిల్దారుగా ప్రశంసాపత్రం పొందిన మధుసూదనరావు ను కార్యాలయంలో పనిచేస్తున్నఉద్యోగులు వీఆర్వోలు సిబ్బంది గురువారం నాడు ఘనంగా సత్కారించారు. తాసిల్దార్ కార్యాలయంలో ఆయన్ను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణి, సర్వేయర్ కష్ణ, డిటి కాగిత పూర్ణచంద్రరావు, వీఆర్వోలు పరసా గోవిందరాజులు ,అంకాలరావు, షకీరుల్లా మౌలాలి, శ్రీనివాస్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పశువైద్యాధికారికి సన్మానం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఉత్తమ సేవలు అందించిన చల్లపల్లి మండల వెటర్నరీ పశు వైద్యాధికారి డాక్టర్ పిన్నమనేని మనోజ్ ను మండల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట భార్గవ్ కుమార్ అధ్వర్యంలో తొట్టెంపూడి వెంకటకష్ణరావు, అంబటి భువనేశ్వరరావు లు గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిఎంఒకు అభినందనలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక వెలుగు ఎపిఎంఓ నత్తా సాంబమూర్తికి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంసా పత్రాన్ని జెసి అపరాజితా సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన గుడ్లల్లేరు మండలంలో డ్వాక్రా సంఘాల ఆర్థిక అభివద్ధికి ఎంతగానో కృషి చేసినందుకు గాను ఈవార్డును పొందినట్లు తెలిపారు. మండల అధికారులు ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సీసీలు, మిత్రాలు ఆయనకు అభినందనలు తెలిపారు

## మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం

**ప్రజాశక్తి-గుడివాడ :** రాష్ట్ర ప్రభుత్వం నుండి సేవా పురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ వి.మురళీకష్ణ స్వగృహంలో గురువారం ఏపి ఎన్జీవో నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా ఎపి.ఎన్జీవోస్ గుడివాడ తాలుక యూనిట్ అధ్యక్షా, కార్యదర్శులు షేక్ ఫరీద్‌బాషా, గోగులమూడి రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ అగష్టు 15న ఉత్తమ సేవ పురస్వారం అందుకున్న మురళీకృష్ణను ప్రతి ఒక్కరు అభినందించాలన్నారు. ప్రజల మన్ననలు పొందే అధికారులకు పురస్కారాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస అసోసియేషన్ నాయకులు కె.మహేష్, వరప్రసాద్, కోటేశ్వరరావు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



కమిషనర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

## శ్మశాన భూమిపై నివేదిక కోరిన కలెక్టర్

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** శ్మశానభూమిలేని ఉయ్యూరు మండలం, బోళ్ళపాడు దళితవాడ సమస్యపై ఉయ్యూరు ఆర్‌డిఓను, తహశీల్దారును జిల్లా కలెక్టర్ పి.రాజబాబు నివేదిక కోరారు. 'స్పందన'లో కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఫిర్యాదుమేరకు నివేదిక కోరుతూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. బోళ్ళపాడు గ్రామంలో దళితవాడకు చెందిన 100 కుటుంబాల ప్రజలు మృతదేహాలు ఖననం చేసేందుకు తగిన శ్మశానభూమి లేక ఇబ్బందులు పడుతుండడంతో శ్రీనివాసగౌడ్ స్పందనలో ఫిర్యాదు చేశారు.



చికిత్స పొందిన బాలికతో వైద్యులు

## తీవ్రంగా గాయపడిన బాలిక ప్రాణాలు కాపాడిన 'అంకుర హాస్పిటల్'

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ** : తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు తీవ్ర రక్తస్రావమై విషమ పరిస్థితిలో ఉన్న 10 ఏళ్ళ బాలికకు అంకుర హాస్పిటల్ వైద్య బందం విజయవంతంగా చికిత్స అందించి ఆమె ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు గురువారం మొగల్రాజపురంలో గల అంకుర హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ భద్రాచలం దగ్గర జరిగిన ఒక ప్రమాదంలో తలతో పాటు ఎడమ భుజం, ఎడమ తొడ ఎముకలు విరగడం, పెరినియల్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో మదు కణజాల నష్టం జరిగి విషమ పరిస్థితిలో బాలిక తల్లిదండ్రులు తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చారని తెలిపారు. నిష్ణాతులైన తమ వైద్య బందం బాలికను కాపాడటానికి రక్తస్రావం ఆపడానికి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు రోగి ఆరోగ్య స్థితిని స్థిరీకరించి ఆపై అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సా విధానాలు నిర్వహించి ఆమె ప్రాణాలు కాపాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటెన్సివిస్ట్ డాక్టర్ ఎం.రవి కుమార్, డాక్టర్ పి.అనురూప, పిడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఎం.వరుణ్ కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.సాయి కష్ణ, మత్తు వైద్యులు డాక్టర్ పి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీ షా

## గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

**ఎపి గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డి లక్ష్మిషా**

**ప్రజాశక్తి - విజయవాడ :** జిల్లాలో గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేసి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఎపి రాష్ట్ర గృహ నిర్మాణాల శాఖ ఎమ్‌డి జి.లక్ష్మిషా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల గృహాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్న దృష్ట్యా జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని గురువారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లక్ష్మిషా వివిధ స్థాయి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15,127 గృహ నిర్మాణాల లక్ష్యానికి గానూ ఇప్పటికే 14,958కు పైగా నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. తుది దశలో ఉన్న 169 గృహ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తిచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా పూర్తి చేయవలసిన నిర్మాణాల్లో ఎక్కువగా విజయవాడ సెంట్రల్ 56, పశ్చిమ 16, మైలవరం15, జగ్గయ్యపేట 13, ఇబ్రహీంపట్నం 13, విజయవాడ రూరల్ 12 మండలాలలో ఉన్నాయని వీటిని పూర్తి చేసేలా గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. లేఅవుట్లలోని కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా సోక్‌పిట్స్, వెల్‌కమ్ ఆర్చస్, రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర వసతులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణాల శాఖ ప్రాజెక్టు కుమార్ యం.రజిని కుమారి, నగర పాలక సంస్థ అడిషనల్ కమీషనర్ సత్యవతి, హౌసింగ్ ఎఇలు, డిఇలు, ఇఇలు, మండల ఇన్‌చార్జ్ అధికారులు ఉన్నారు.

# లోకేష్ 'యువగళం'కు విస్తృత ఏర్పాట్లు


**19న బ్యారేజి వద్ద ఘనస్వాగతం**

**50 వేల మంది వరకు జన సమీకరణ**

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో నాలుగు రోజులు పాదయాత్ర**

**22న గన్నవరంలో భారీ బహిరంగ సభ**

**ప్రజాశక్తితో కేశినేని శివనాథ్ (చిన్ని)**



**ప్రజాశక్తి - విజయవాడ :** ఎన్‌టిఆర్ జిల్లాలో నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల టిడిపి ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో లోకేష్ పాదయాత్రను విజయవంతం చేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా తమ శ్రేణులను సమీకరిస్తున్నామని చెప్పారు. నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రపై ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తదితర రూపాల్లో ప్రచార ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. వీటికి అనుమతి ఇవ్వాలని అధికారులను కోరినట్లు చెప్పారు.

**ప్రశ్న : లోకేష్ యువగళం కార్యక్రమం ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయి?**

'యువగళం' పాదయాత్రను విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని నియోజకవర్గాల ఇన్చార్జులు, ముఖ్య నేతలతో కలిసి రూట్ మ్యాప్ రూపొందించాం. జన సమీకరణ తదితర ఏర్పాట్లపై పార్టీ జిల్లా కార్యాలయంలో ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించాం. పార్టీ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురామ్ సూచనల మేరకు 'యువగళం'ను విజయవంతం చేసేందుకు శక్తి మేరకు కృషి చేస్తున్నాం. లోకేష్‌కు ఘన స్వాగతం పలికేందుకు బేతాళ నృత్యాలు, తెలంగాణా పోప్‌సాంగ్స్, గ్రామ దేవతల వేషాలు, వివిధ రకాల వేషధారణలు, డప్పులు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ప్రకాశం బ్యారేజి వద్ద ఘన స్వాగతం పలుకుతాం.

**ప్రశ్న : జన సమీకరణ ఏలా చేస్తున్నారు ?**

లోకేష్ పాదయాత్ర ప్రవేశించే రోజున ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి 19న 50 వేల మందిని సమీకరిస్తున్నాం. రెండో రోజున 20 వేల మంది వరకు ఉంటారు. అలాగే ఈనెల 22న గన్నవరంలో జరిగే బహిరంగ సభకు 1.5 లక్షల నుండి 2 లక్షల మంది వరకు జనాన్ని సమీకరించనున్నాం. ఇందుకు పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. కుప్పం బహిరంగ సభ తర్వాత గన్నవరంలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. జన సమీకరణకు అనుగుణంగా భోజనం, మంచినీరు, టీషర్టులు తదితర ఏర్పాట్లు చేస్తున్నాం.

**ప్రశ్న: ఉమ్మడి కృష్ణాజిల్లాలో 'యువగళం' ఎన్ని రోజులు సాగుతుంది ? రూట్ మ్యాప్ ఏంటి ?**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో నాలుగు రోజులపాటు సాగుతుంది. ఈనెల 19, 20 తేదీల్లో ఎన్‌టిఆర్ జిల్లాలో, ఆ తర్వాత మరో రెండు రోజులు కృష్ణాజిల్లాలో సాగుతుంది. ఈనెల 22న గన్నవరంలో బహిరంగ సభ నిర్వహిస్తాం. 19వ తేదీ రాత్రి విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని ఎ-1 కన్వెన్షన్ హాలు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో లోకేష్ బస చేస్తారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎన్‌టిఆర్ జిల్లాలో పాదయాత్ర జరుగుతుంది. 19న విజయవాడ పశ్చిమ, సెంట్రల్, 20న విజయవాడ తూర్పు, పెనమలూరు నియోజకవర్గాల్లో లోకేష్ పర్యటన ఉంటుంది. మొదటి రోజున పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ప్రకాశంబ్యారేజి వద్ద ఘన స్వాగతం పలికిన తర్వాత వినాయకుడి గుడి మీదుగా సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోకి యాత్ర ప్రవేశిస్తుంది. పోలీసు కంట్రోల్‌రూమ్, స్వర్ణ పాలస్, విజయటాకీస్, సీతారాంపురం, చుట్టుగుంట బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు, విశాలాంధ్ర రోడ్డు, మెట్రో, మున్సిపల్ స్టేడియం, ఎంజి రోడ్డు, చందనాగ్రాండ్ మీదుగా బృందావన్‌కాలనీలోని ఎ-1 కన్వెన్షన్ హాలు సెంటర్‌కు చేరుకుంటుంది. రాత్రికి అక్కడ బస ఏర్పాట్లు ఉంటాయి. రెండో రోజున ఎ-1 కన్వెన్షన్ నుంచి డివి మానర్, ఎన్‌టిఆర్ సర్కిల్, దుర్గామహల్, హైస్కూల్ రోడ్డు, రైతు బజార్, పంట కాల్వ, సనత్‌నగర్ మీదుగా పెనమలూరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది.

## పెరిగిన బియ్యం ధరలు - గగ్గోలు పెడుతున్న ప్రజలు

**ప్రజాశక్తి - విజయవాడ :** పెరిగిన బియ్యం ధరలపై ప్రజలు గగ్గోలు పెడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. గురువారం పలు షాపుల్లో ధరలను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. బియ్యం, నిత్యావసర సరుకుల ధరలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బియ్యం కేజీకి రూ.8 నుండి 12 కు పెరిగాయని అన్నారు. దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బియ్యంపై కూడా జిఎస్టి భారం వేయటం దారుణమన్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను మోడీ సర్కార్ అడ్డగోలుగా పెంచిందని మండిపడ్డారు. పెట్రోలు, డీజిల్ పై తొమ్మిదేళ్లలో 25 లక్షల కోట్ల రూపాయలు పన్నుల భారం ప్రజలపై వేసి ఖజానా నింపుకుందన్నారు. రిటైల్ వర్తకంలోకి కార్పొరేట్, బహుళ జాతి కంపెనీల ప్రవేశంతో చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రిటైల్ మార్కెట్ కార్పొరేట్ల చేతుల్లో బందీగా మారింది. వ్యవస్థీకత బ్లాక్ మార్కెటింగ్ జరుగుతుదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని దుయ్యబట్టారు. ఈ ధరలను వ్యతిరేకిస్తూ



ధరలు తెలుసుకుంటున్న బాబూరావు

సిపిఎం సెప్టెంబర్ మొదటి వారంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో బాబురావు వెంట సిపిఎం నేతలు, ప్రజా సంఘాల నాయకులు కే.సరోజా, వై.సుబ్బారావు, క్రాంతి, గురుమూర్తి, లక్ష్మణ, కోరుట్ల శ్రీనివాస్, గౌరీ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్‌యుబి పనులు త్వరగా పూర్తి చేయాలి : కమిషనర్

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం మధురానగర్ ఆర్.యు.బి నిర్మాణ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం బి.ఆర్.టి.సి రోడ్డు, బందర్ రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. సెంట్రల్ నియోజకవర్గ 29వ డివిజన్‌లోని సాయిబాబా కాలనీలో నగరపాలక సంస్థ అధ్వర్యంలో జరుగుతున్న మధురానగర్ ఆర్‌యుబి నిర్మాణ పనులను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఫండ్కర్ సమగ్రంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని ప్రజల రాకపోకలకు ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన అందుబాటులోనికి తీసుకునిరావాలని సంబంధిత అధికారులను



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ పట్టణ అభివద్ధి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కొనసాగుతున్న ప్రయత్నాల్లో భాగంగా మధురానగర్ ఆర్‌యుబి నిర్మాణ ప్రాజెక్ట్ చేపట్టినట్లు ఈ పనులను త్వరగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పి.రత్నావళి ఇతర అధికారులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం అధికారులతో కలసి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరుగుతున్న నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. భవనం లోపల జరుగుతున్న పనుల స్థితిగతులు, అక్కడ ఏర్పాటు చేయబోతున్న మౌలిక సదుపాయాలు మొదలగు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడో ఫ్లోర్‌లో జరుగుతున్న మార్బుల్, సీలింగ్, కరెంట్, ప్లాస్టింగ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను వేగవంతంగా చేసి త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా ఇంజినీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. పనుల్లో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీషుపై ప్రావీణ్యత

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యత పొందేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను అందిస్తున్నాయని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ఇండియా హెడ్ సుమంత దత్తా అన్నారు. నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లభాష బోధనపై పరిశీలనా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా దత్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా పంపిణీ చేస్తున్న ఇంగ్లీషు - తెలుగు ద్విభాషా నిఘంటువు ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకు దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులను ఉన్నత ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గత నాలుగేళ్లగా విద్యా కానుక కిట్లలో ఇంగ్లీషు తెలుగు నిఘంటువు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీలను అందిస్తున్నట్లు తెలిపారు.

## ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** గోద్రేజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కంపెనీ బిజినెస్ సిఇఒ సౌభాగ్య నియోగి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంట నూనెల ఉత్పత్తిలో మన దేశాన్ని స్వావలంబన దిశగా తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగును మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ రాష్ట్రంలోని చింతపల్లితో పాటు వివిధ ప్రాంతాలలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా రైతులకు, అధికారులకు, పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను నగరంతో పాటు వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.